



ఉమారుద్ర కోటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి పూజలు
- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లాలోని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి భక్తులు శివాలయాలకు చేరుకున్నారు. క్యూలైన్లలో నిరీక్షించి స్వామిని దర్శించుకున్నారు. రుద్రాభిషేకాలు, క్షీర, జలాభిషేకాలు, అర్చనలు, దీపారాధన చేశారు. హరహర మహాదేవ శంభోశంకర, హరోం హర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర, ఎండల మల్లికార్జున, ఉమారుద్ర కోటేశ్వర ఆలయాలతో పాటు మహేంద్రగిరులపై వెలసిన శివలింగాల దర్శనానికి భక్తులు బారులు తీరారు.

ఉమారుద్ర కోటేశ్వరాలయంలో..

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. బుధవారం వేకువ జాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సుమారు అరకిలో మీటరు వరకు భక్తులు క్యూలో వేచి ఉన్నారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, ఆరవెల్లి హరిగోపాలశర్మ, చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. మహా నందీశ్వర వాహనంపై మేళతాళాలతో తిరువీధి నిర్వహించారు. అనంతరం లింగోద్భవకాలంలో అభిషేకాలు జరిగాయి.



ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎండల మల్లన్నా... చల్లంగ చూడన్నా

టెక్కలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామిని దర్శించు కునేందుకు ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎండల మల్లన్నా, చల్లంగ చూడన్నా అంటూ భక్తులు వేడుకున్నారు. సీత కోనేరు, రావివలస ఆలయ ప్రాంగణం, రోడ్లు ఎటుచూసినా భక్తులతో నిండిపోయాయి. ఈవో జి.గురునాధరావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు, ఫిబ్రవరి 26: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు తరలివచ్చారు. బుధవారం వేకువజాము నుంచే భక్తులు వంశధార నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయం బయట టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. సోమేశ్వర, భీమేశ్వర స్వాములను కూడా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఎస్పీ నేతృత్వంలో టెక్కలి డీఎస్పీ మూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, తదితరులు శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



శ్రీముఖలింగేశ్వరస్వామి సన్నిధిలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



కిటకిటలాడుతున్న క్యూలైన్లు

మహేంద్ర గిరులపై..

పలాస/హరిపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒడిశా-ఆంధ్రా సరిహద్దులోని మహేంద్రగిరులపై పాండవులు ప్రతిష్ఠించినట్లు చెబుతున్న శివలింగాలను దర్శించుకుని భక్తులు పరవశం చెందారు. ఒడిశా, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వివిధ మార్గాల ద్వారా మహేంద్రగిరులకు చేరుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు పలాస, సోంపేట నుంచి 32 బస్సులను నడిపారు. మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మహేంద్ర గిరులపై భక్తజనం



నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్
- ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు
- 3న ఓట్ల లెక్కింపు



శ్రీకాకుళం నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి బయలుదేరిన సిబ్బంది

విశాఖపట్నం/శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరగనున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగియనున్నది. అందుకు తగిన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13,508 మంది, మహిళలు 8,985 మంది ఉన్నారు. పోలింగ్ కోసం ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్ లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతో పాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

పోటీలో ఉన్న అభ్యర్థులు..

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర (మిగతా 8వ పేజీలో)

జిల్లాలో 5,035 మంది ఓటర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శ్రీకాకుళం జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళం నుంచి ఎన్నికల మెటీరియల్‌తో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను విశాఖకు తరలింపు విషయమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పలు సూచనలు చేశారు. జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,416 మంది పురుషులు, 1,619 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలాల వారీగా ఓటర్లను పరిశీలిస్తే.. కొత్తూరు 103, పాతపట్టణం 270, మెళియాపుట్టి 99, పలాస 280, మందస 178, కంచిలి 89, ఇచ్ఛాపురం 111, కవిటి 94, సోంపేట 176, వజ్రపుకొత్తూరు 78, నందిగాం 98, హిరమండలం 70, ఎల్.ఎన్.పేట 27, సారవకోట 66, టెక్కలి 254, సంతబొమ్మాళి 52, కోటబొమ్మాళి 112, జలుమూరు 102, సరుబుజ్జిలి 57, బూర్జ 54, జి.సిగడాం 84, ఆమదాలవలస 329, నరసన్నపేట 200, పోలాకి 93, గార 72, శ్రీకాకుళం-1.. 710, శ్రీకాకుళం-2.. 707, పొందూరు 199, లావేరు 44, రణస్థలం 57, ఎచ్చెర్ల 170 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికీ ఇప్పటికే ఓటరు స్లిప్పులను పంపిణీ చేసేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరం వరకు పోలీసు నిఘా ఉంటుంది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిపిస్తామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.

చీట్‌ఫండ్ కంపెనీలు

- జిల్లాలో అనధికారికంగా నిర్వహణ
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
- అంతటా ఆర్థిక మోసాలు
- నిలువునా మోసపోతున్న ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



- కొన్నేళ్ల కిందట అగ్రిగోల్డ్ సంస్థ ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించింది. జిల్లాలో వేలాది మంది ఈ సంస్థలో సేవింగ్స్ చేశారు. వీరిలో ఎక్కువ మంది రోజువారి కూలీలు, శ్రామికులే ఉన్నారు. కానీ, సదరు సంస్థ బోర్డు తిప్పేసింది. పదేళ్లు గడుస్తున్నా ఇంతవరకూ బాధితులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వాలు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాయి. ఈ ఒక్క సంస్థే కాదు ఇలాంటి ఎన్నో సంస్థలు ప్రజలను ముంచేశాయి.

- ఇటీవల ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఇద్దరు వ్యాపారస్థులు రూ.కోట్లలో అప్పులు చేశారు. తీరా అడిగేసరికి ఐపీ పెట్టి తప్పించుకున్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అధిక వడ్డీకి ఆశపడి తనకూతురు పెళ్లి కోసం దాచిన డబ్బులను ఆ వ్యాపారస్థులకు అప్పు ఇచ్చాడు. కూతురు పెళ్లి దగ్గరకు వచ్చేసరికి ఇచ్చిన డబ్బులు అడిగితే ఐపీ పెట్టి తప్పించుకున్నారు. ఇలాంటి బాధితులు ఇచ్ఛాపురం పట్టణంలో చాలామంది ఉన్నారు.

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు ఆర్థిక మోసాలకు గురవుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము పరులపాలవుతోంది. పిల్లల చదువులు, వివాహాలు, ఇంటి నిర్మాణం వంటి భవిష్యత్ అవసరాలకు పొదుపు చేసిన వారు చిట్‌లు కట్టి మోసపోతున్నారు. ఇందులో చిరుద్యోగులు, కార్మికులు, దినసరి కూలీలే బాధితులవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా మహిళలను టార్గెట్ చేసుకొని మోసాలు పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట మోసాలు వెలుగుచూస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. కష్టపడి సంపాదించిందంతా డిపాజిట్ల రూపంలో పెట్టి మూల్యం చెల్లించుకుంటున్నారు. తాము మోసపోయామని తెలిసి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆర్థికపరమైన అంశాలు కావడం, మోసం చేసిన వారు ఐపీ పెట్టేస్తుండడంతో ఆ కేసులు కూడా నీరుగారిపోతున్నాయి. అయితే తాము అవగాహన కల్పిస్తున్నా.. ప్రజలు మోసాలకు గురవుతున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవంగా మాత్రం గ్రామస్థాయిలో ఎటువంటి అవగాహన చేపట్టడం లేదు. ప్రధానంగా ప్రజల నిరక్షరాస్యత, అవగాహన లేమిని ఆసరా చేసుకొని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీ వంటివి పొదుపు పథకాలు ప్రారంభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. అటు ప్రభుత్వరంగ సంస్థలు సైతం పొదుపు పథకాలపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఫలితంగా కొందరు అక్రమార్కులు అధిక వడ్డీ ఆశచూపి ప్రజలను మోసం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా..

జిల్లా వ్యాప్తంగా చిట్ ఫండ్ ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా ఏర్పాటవుతున్నాయి. వాస్తవానికి చిట్ ఫండ్, ఫైనాన్స్ సంస్థలకు అనుమతులు తప్పనిసరి. కొన్ని నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. ఆర్బీఐ లేదా సెబీ అనుమతితోనే ఆ సంస్థలు డిపాజిట్లు సేకరించాలి. రోజువారి వసూళ్లు చేపట్టాలి. అది కూడా ముందే నిర్ణయించిన స్కీమ్ ప్రకారం, నిర్దేశించిన గడువు వరకే చేయాలి. కానీ, అలా చేయడం లేదు. ఐదు సంవత్సరాలు పొదుపు చేస్తే.. పదేళ్ల మొత్తాన్ని చెల్లిస్తామని.. రెట్టింపు వడ్డీ చెల్లిస్తామని నమ్మబలుకుతుండడంతో ప్రజలు కూడా ఆకర్షితులవుతున్నారు. ఏజెంట్లు ఊరికి వెళ్లి మరీ వసూలు చేస్తున్నారు. కొత్త ఇన్వెస్టర్ల దగ్గర వసూలు చేసిన మొత్తాన్ని పాత ఇన్వెస్టర్లకు సర్దుబాటు చేస్తున్నారు. ఒక్కోసారి లావాదేవీలు నిలిచిపోతే దుకాణం సర్దేస్తున్నారు. జిల్లాలో వందలాదిగా చిట్‌ఫండ్ కంపెనీలు ఉన్నాయి. ఇందులో కొన్నింటికే అనుమతులున్నాయి. ఇలాంటి సంస్థలు ప్రజలు కడుతున్న సొమ్ముతో ఉడాయిస్తున్నాయి.

అధిక వడ్డీ ఆశ చూపి..

సాధారణంగా బ్యాంకులు,పోస్టాఫీసుల్లో డిపాజిట్లు చేస్తే 7 నుంచి 9 శాతం వరకూ వడ్డీ లభిస్తుంది. అంతకంటే మించి ఇవ్వడం అంటే అది మోసం చేయడమే. అప్పుడే మనం అనుమానించాలి. రెండు, మూడు, ఐదేళ్లలో రెట్టింపు ఇస్తామన్న మాట అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. ఎవరైనా చిట్ కట్టాలని కోరితే సంబంధిత కంపెనీ (మిగతా 7వ పేజీలో)

20కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి తమిళనాడుకు తరలింపు
- ముగ్గురి అరెస్టు

పాతపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ముగ్గురు తమిళనాడు వాసులను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20.085 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను పాతపట్నం పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి విలేకరులకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి జిల్లా శ్రీరంగం తాలూకా ధీరానగర్, రామ్‌జీనగర్, కె.కల్లికుడినార్‌కు చెందిన మోహన్‌రాజ్ పెరుమాళ్, శక్తివేల్ క్రిష్ణన్, గౌతమ్ సెంథిల్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. విలాసాలకు డబ్బులు లేకపోవడంతో గంజాయిని విక్రయించి సంపాదించాలనుకున్నారు. ముగ్గురూ కలిసి ఒడిశా రాష్ట్రం మునిగూడకు వెళ్లి ఓ దివ్యాంగుని వద్ద 20.085కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడి నుంచి పర్లాకిమిడి మీదుగా పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. పాతపట్నం నుంచి బస్సులో విశాఖపట్నం వెళ్లి, అక్కడి నుంచి రైలులో చెన్నై వెళ్లేందుకు ప్రణాళికను రూపొందించుకున్నారు. అయితే, పాతపట్నం కాంప్లెక్స్‌కు బుధవారం ఉదయం 11 గంటలకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు బీవీఆర్ రెడ్డి, వి.వరలక్ష్మి కానిస్టేబుల్ పి.తులసిరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మూర్తి

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

- కవిటి మండలానికి చెందిన ఇద్దరు యువకుల మృతి

8లో



లక్ష్మణ్, రాజు (ఫైల్)

డోర్ లాక్ పేరిట కరెంట్ బిల్లు మోత

- వినియోగదారులకు అధిక మొత్తంలో బిల్లు
- ఇంటికి తాళం వేశారని చెబుతున్న వైనం
- నిలదీస్తే న్యాయం.. లేకుంటే జేబులు ఖాళీ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ఓ వైపు కూటమి ప్రభుత్వం చెబుతుంటే.. మరో వైపు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖాధికారులు అదనపు బిల్లులతో ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. గతంలో రెండు నెలలకోసారి వచ్చే కరెంట్ బిల్లు గత వైసీపీ ప్రభుత్వం చలువతో ప్రతీ నెలా వసూలు చేస్తుంది. దీనికి అలవాటుపడిన ప్రజలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల బాదుడు నుంచి ఉపసమనం కలిగించింది. అయితే విద్యుత్ అధికారులు, కరెంట్ రీడింగ్‌లు తీసే వారి నిర్లక్ష్యంతో డోర్‌లాక్ పేరిట అధిక మొత్తం బిల్లు వేస్తున్నారు. జిల్లాలో ప్రతీనెలా 2వ తేదీ నుంచి 12వ తేదీ నాటికి ఇంటింటికి వెళ్లి కరెంట్ బిల్లులు రీడింగ్ తీస్తుంటారు. ఈ బిల్లును నెలాఖరులోగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ బిల్లులు తీసే బాధ్యత ఏపీఈపీడీసీఎల్ ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ కొంత మంది యువతను నియమించి వారితో ప్రతీ ఇంటికి కరెంట్ బిల్లుల రీడింగ్ తీయిస్తుంది. ఒక రోజుకు ఓ వ్యక్తి ఎన్ని రీడింగ్‌లు తీస్తే అంత కమీషన్ రూపంలో వేతనాలు ఇస్తుంది. అయితే ప్రతీ నెలా 16వ తేదీ వరకు కూడా బిల్లులు తీయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటికి రీడింగ్ తీసే సమయంలో వినియోగదారుల వద్ద బిల్లుకు రెండు రూపాయలు చొప్పున వసూలు చేస్తుంటారు. ఇలా ప్రతీ నెలా కరెంట్ బిల్లులు జనరేట్ చేస్తుంటారు.

తాళం వేస్తే రీడింగ్ తీయరు..

వినియోగదారులు ఎంత కరెంట్ వినియోగిస్తే అంత బిల్లు రావడం సహజం. కానీ కరెంట్ వినియోగించకపోయినా వేల రూపాయలు బిల్లులు వినియోగదారులు చెల్లించే పరిస్థితి నెలకొంది. ప్రతీనెలా కరెంట్ రీడింగ్ తీసేందుకు వచ్చే బోయ్‌ల నిర్లక్ష్యంతో వినియోగదారులపై బిల్లుల భారం పడుతుంది. రీడింగ్ బోయ్ ఇంటికి వచ్చేటప్పుడు డోర్‌లాక్ చేసుంటే ఇక అంతే సంగతి. రీడింగ్ తీసే వ్యక్తి డోర్‌లాక్ అని బిల్లు కొట్టడంతో రూ.500 నుంచి రూ.1000 రావాల్సిన బిల్లు రెండు వేల నుంచి నాలు గు వేల రూపాయలు వరకు వస్తుంది. నిజానికి ఇంట్లో మీటర్ ఉండి రీడింగ్ తీయడానికి ఇబ్బంది కలిగితే డోర్ లాక్ బిల్లు వచ్చిందంటే ఆలోచించొచ్చు. కానీ అపార్ట్‌మెంట్‌లకు సైతం కరెంట్ బిల్లులు డోర్‌లాక్ రూపంలో వేలల్లో రావడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది. ఇటీవల ఫరీద్‌పేట సమీపంలో ఉషోదయ నగర్ వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వారందరికి డోర్‌లాక్ పేరుతో కరెంట్ బిల్లులు జనరేట్ చేశారు. అయితే ప్రతీ నెల రూ.500 నుంచి రూ.800 వచ్చే కరెంట్ బిల్లు ఒక్కసారిగా రూ.2099 రూపాయలు రావడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదేంటని విద్యుత్ శాఖాధికా రులను ప్రశ్నిస్తే డోర్‌లాక్ బిల్లు వచ్చిందంటూ సమాధానం చెప్పడం విశేషం. లైన్‌మన్‌ను అపార్ట్‌మెంట్‌కు డోర్‌లాక్ అని ఎలా బిల్లు కొట్టారని ప్రశ్నిస్తే సమధానం కరువైంది. వినియోగదారుడు నిలదీయడం తో హడావుడిగా బిల్లు అప్డేట్ చేసి మళ్లీ రీడింగ్ తీయించి రూ.837 బిల్లును ఇచ్చారు. అలాగే వీఎస్ కాలనీలో కూడా ఇదే తరహాలో డిసెంబరు, జనవరి నెలల బిల్లులు డోర్ లాక్ రూపంలో రూ.4308 ఇవ్వడంతో ఓ వినియోగదారుడు విద్యుత్ శాఖాధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. తన ఇల్లు రెండు నెలలుగా ఖాళీగా ఉన్నా.. వేల రూపాయలు బిల్లు వచ్చిందని తగ్గించాలని విన్నవించుకున్నా వచ్చిన బిల్లు చెల్లించాల్సిందేనని చెప్పడంతో గత్యంతరం లేక చెల్లించాడు. ఇలా జిల్లా వ్యాప్తంగా డోర్ లాక్ బిల్లులతో విని యోగదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.


Eastern power
PAYMENT RECEIPT

Transaction No :	BB250500012340
Consumer No :	131102A2020
Date :	19-02-2025
Section :	BALAGA
ERO :	ERO-SRIKAKULAM
Received From :	
Bill Amount :	4308
RC Amount :	0
Amount Paid :	4308.0

డోర్‌లాక్ పేరిట రూ.వేలల్లో విద్యుత్ బిల్లు

సమస్య మా దృష్టికి తెస్తే బిల్లులో మినహాయిస్తాం

ఇంటి లోపల మీటర్ ఉన్నప్పుడు.. వినియోగదారులు ఇతర ప్రాంతాలకు మైగ్రేట్ అయినప్పుడు డోర్‌లాక్ బిల్లు వేస్తాం. అది కూడా పాత మూడు నెలల బిల్లు యావరేజ్‌గా తీసుకుని బిల్లు వేస్తాం. అపార్ట్‌మెంట్‌లకు డోర్‌లాక్ బిల్లులు వేస్తున్నట్టు మా దృష్టికి రాలేదు. డోర్‌లాక్‌లో వేల రూపాయలు బిల్లు వేస్తే కార్యాలయ అధికారులను కానీ నేరుగా ఎస్ఈని సంప్రదిస్తే తర్వాత బిల్లులో మినహాయిస్తాం. ప్రతీ నెలా 2వ తేదీన కాంట్రాక్టర్‌తో బిల్లు రీడింగ్‌ల విషయంలో సమావేశం నిర్వహి స్తున్నాం. ఇకపై ఇలా అపార్ట్‌మెంట్‌లో ఇళ్లకు డోర్‌లాక్‌లో అధిక బిల్లులు వేస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.

\- సురేష్, ఈఈ, విద్యుత్‌శాఖ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
- టెక్కలి, పలాసల్లో సామగ్రి పంపిణీ

టెక్కలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి పలాస, టెక్కలిల్లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. వీటిని పట్టుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బందికి బ్యాలెట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసులకు, రూట్, జోన్ ఆఫీసర్లకు, ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై ఆయన దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తుతో పాటు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు, బందోబస్తు అంశాలను సమీక్షించారు. 1,053 మంది ఓటర్లకు పీవో, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లు ఏ తరహా విధులు నిర్వహిం చాలో వివరించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలన్నారు.


సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

8 మండలాలు.. 8 పోలింగ్ కేంద్రాలు

పలాస, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆర్డీవో వెంకటేష్ బుధవారం పంపిణీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సామగ్రి పంపిణీ బస్సుల్లో తరలింపు ప్రక్రియ పూర్తయింది. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆర్డీవోప్రకటించారు. పలాస డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో 8 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 280 మంది ఉపాధ్యాయులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. 40 మంది సిబ్బందిని నియమించగా, 23 మందిని రిజర్వు చేశారు. అత్యవసర సమయాల్లో వారి సేవలు వినియోగిస్తామని అధికారులు ప్రకటించారు.


పలాస: స్ట్రాంగ్ రూంలో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

రావివలసలో ట్రాఫిక్‌జామ్

టెక్కలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకు ప్రసిద్ధ శైవ క్షేత్రమైన రావివలస ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బుధవారం భక్తులు పోటెత్త డంతో దారులన్నీ కిక్కిరిశాయి. రావివలస ఊరి మధ్యలో ట్రాఫిక్‌తో తీవ్ర అంతరాయం ఏర్ప డింది. ఓ వైపు భక్తులు, మరోవైపు వాహనాలు, వీఐపీల వాహనాలు కారణంగా సుమారు గంటన్నర సేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో పోలీసులు ఆయా కేంద్రాలకు వెళ్లడంతో అరకొర సిబ్బందితో ఈ సమస్య ఉత్పన్న మైంది. ట్రాఫిక్‌లో చిక్కుకుని భక్తులు ఇబ్బందిపడ్డారు.


టెక్కలి: రావివలసలో నిలిచిపోయిన ట్రాఫిక్

హీరోయిన్ల ఫ్లెక్సీలపై మండిపాటు

పలువురు వ్యాపారులు వ్యాపారాభివృద్ధి కోసం సినీ హీరోయిన్ల ఫ్లెక్సీలను ఆలయం వద్ద ఏర్పాటు చేయడంపై భక్తులు మండిపడ్డారు. ఆలయానికి సంబంధించిన ఎటువంటి సమాచారం లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుకు అధికారులు అనుమతివ్వడంపై స్థాని క బీజేపీ నాయకుడు చిట్టిబారికి లింగరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

కాగితాలు ఏరుకునే భక్తుడు.. ఉచిత ప్రసాదం పంపిణీ

టెక్కలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రోడ్లపై రోజూ కాగితాలు ఏరుకుని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకొని రావివలస ఎండల మల్లన్న ఆలయానికి వెళ్లే భక్తులకుగాను స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో ఉచిత ప్రసాదం పంపిణీ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. టెక్కలి ఆదీఆంధ్రా వీధికి చెందిన వానగాల జాని పట్టణంలో నిత్యం సంచి పట్టుకొని కాగితాలు ఏరుతూ కనిపిస్తాడు. అయితే శివరాత్రి సందర్భంగా కాషాయ వస్త్రాలు ధరించి టెక్కలి సమీపంలోని ఏటి నుంచి కాశీ కావిడి ద్వారా నీటిని తీసుకుని ఎండలమల్లి కార్జున స్వామికి అభిషేకం చేశాడు. ఆ తరువాత సుమారు 100 కేజీల పులిహోర, తాగునీటి ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశాడు. నిరుపేద అయినా ఆ భక్తుడి ఆలోచన స్థానికులను ఆశ్చర్య చకితులను చేసింది. పలువురు ఆయనను అభినందించారు.


టెక్కలి: ప్రసాదం పంపిణీ చేస్తున్న జానీ (కాషాయ వస్త్రంతో)

మత విద్వేషాలను అరికట్టాలి

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): డొంకూరు గ్రామంలో ఈ నెల 13న జిల్లాలోని మత్స్యకార మైనార్టీలపై కొందరు రాజకీయ ముసుగులో మతవిద్వేషాలు, క్రైస్తవ కుటుంబాలను సాంఘిక బహిష్కరణ వంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఇటువంటి చర్యలు అరికట్టాలని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్ జాన్‌ను ఆ గ్రామ మైనార్టీలు కోరారు. గ్రామంలో హిందువులు, క్రైస్తవుల మధ్య విభేదాలు సృష్టించి గొడవలు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో జేమ్స్ కుంపట్ల, ఎం.సుధాకర్, జాన్సన్, కూర్మారావు, సన్నీ తదితరులు ఉన్నారు.


మైనార్టీ వెల్ఫేర్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పశువైద్య అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పొందూరు ఏడీ

పొందూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పీఎస్‌జీ బాలకృష్ణ రాష్ట్ర పశువైద్య అధికారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని పశువైద్యశాఖకు చెందిన ఏడీలు, డీడీలు పాల్గొన్నారు. బాలకృష్ణ ఎన్నికపై శ్రీకాకుళం జిల్లా వెటర్నరీ జేడీ కె.రాజగోపాల్, శ్రీకాకుళం జిల్లా పశువైద్యాధికారుల సంఘం, జిల్లా పశువైద్య అధికారుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


ధ్రువ పత్రాన్ని అందుకుంటున్న ఏడీ డాక్టర్ బాలకృష్ణ

కాలినడకన రామతీర్థానికి నారువ యువత


కాలినడకన వెళ్తున్న యువత

రణస్థలం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా నారువ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నింద్రబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో పది మంది యువత కాలినడకన బుధవారం రాత్రి సీతా శ్రీరాములవారిని దర్శించేకునేందుకు బయలుదేరారు. గతేడాది రామకృష్ణ ఆధ్వర్యంలో ఐదుగురు సైకిల్‌పై తిరుపతికి వెళ్తున్న క్రమంలో చిత్తూరు జిల్లా పుంగనూరులో అప్పటిమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల చేతులో దాడికి గురైన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అదే బృందంలోని మాజీ సర్పంచ్ నింద్రబంగి రామకృష్ణ ఆధ్వర్యంలోని ఐదుగురు బైక్ ర్యాలీగా కుంభమేళాకు ఇటీవల తరలివెళ్లారు. చంద్రబాబు సీఎం కావడంతోనే ఈ మొక్కు తీర్చుకున్నట్టు వారు తెలిపారు.

సందడిగా రామయ్య తండ్రి సంబరాలు


తిరువీధిలో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో బుధవారం రామయ్య తండ్రి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పున్నాన, పొగిరి, మక్క వారి కుటుంబాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబారాల్లో భాగంగా రామయ్య తండ్రి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ సంబరాల్లో జానపద, తప్పెట గుళ్ల, పందిరిపాట తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేరారు.

అరసవల్లిలో తిరువీధి మహోత్సవం


అరసవల్లిలో తిరువీధి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి క్షేత్రపాలకుడు భువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులకు బుధవారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను పండితుల వేదమంత్రాల నడుమ ఊరేగించారు. అనంతరం స్వామివారికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 12 గంటల తర్వాత లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పి లి శంకరశర్మ, ఇప్పిలి షన్ముఖశర్మ, శ్రీనివాసశర్మ, చక్రవర్తి తదితరు లు పాల్గొన్నారు. అలాగే ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో వేదపండితులు, అర్చకులు సహస్ర మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు.

'చీట్'ఫండ్ కంపెనీలు

(5వ పేజీ తరువాయి)

రిజిస్టర్ అయ్యిందా లేదా అని గమనించాలి. ఏజెంట్లు చెప్పే మాటలు నిజమా కాదా అని ఆరాతీయాలి. మోసమని గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. లేక సెబీకి చెందిన స్కోర్స్ ప్లాట్ ఫారమ్‌లో ఫిర్యాదు చేయవచ్చు. భారత్ పోస్టల్ డిపార్ట్‌మెంట్, ఎల్ఐసీ అన్నివర్గాల ప్రజల గురించి పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది. పిల్లల చదువులు, వివాహాలు, ఇళ్ల నిర్మాణం, చివరకు వృద్ధాప్యంలో సైతం ఆసరాగా ఉండే ఎన్నో పథకాలను ఇటీవల ప్రవేశపెట్టింది. సొంత గ్రామంలో, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా కట్టుకునే వెసులబాటు కూడా ఉంది. పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతా, 5 సంవత్సరాల రికరింగ్ డిపాజిట్ ఖాతా, టైమ్ డిపాజిట్ ఖాతా, నెలవారి ఆదాయం పథకం ఖాతా, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, 15 సంవత్సరాల పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతా, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్స్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజనతోపాటు ఎల్ఐసీలో సైతం అన్నివయసుల వారికి పొదుపు పథకాలు ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి

ఇటీవల ఆర్థికపరమైన నేరాలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దళారులు, ఏజెంట్ల మాయ మాటలు నమ్మవద్దు. అధిక వడ్డీ ఆశచూపే వారి వలలో పడొద్దు. మోసం జరగక ముందే గ్రహించాలి. తీరా మోసం జరిగిన తరువాత పోలీసులను ఆశ్రయించినా.. రకరకాల కారణాలు చూపు తూ ఆర్థిక సంస్థల నిర్వాహకులు తప్పించు కుంటున్నారు. ప్రజలు ముందే మేల్కొంటే చాలా మంచిది.

\- మీసాల చిన్నమనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం

క్రైం కార్నర్

వేధింపులు తాళలేకే హత్య

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద
- అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలో రెండు రోజుల కిందట ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో అది హత్యగా నిర్ధారణ కావడంతో నిందితురాలిని అరెస్టు చేశారు. ఈ మేరకు శ్రీకాకుళం సబ్ డివిజనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో డీఎస్పీ సీ హెచ్ వివేకానంద ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నగరంలోని ఆర్టీసీ బస్సు గ్యారేజ్ పక్కన శివాలయం వెనుక గల టీ ఏజెంట్ వీధికి చెందిన మజ్జి రమేష్(35)తో ఒడిశా రాష్ట్రం రాయఘడ సమీపాన డుకుం గ్రామానికి చెందిన శశి అనే మహిళతో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరి పిల్లలు ఉన్నారు. స్ర్కాప్ షాపులో పని చేస్తు రమేష్ మద్యానికి బానిసై భార్యను అనుమానిస్తూ వేధించడంతోపాటు తీవ్రంగా కొట్టేవాడు. ఈ క్రమంలో ఆమె పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వీరిద్దరికి పోలీసులు, పెద్దలు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి కాపురం కొనసాగించేలా చేశారు. అయినా రమేష్‌లో మార్పు రాలేదు. దీంతో ఈ నెల 3న శశి తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రమేష్ పోలీసులను ఆశ్రయించడంతో మళ్లీ ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కాపురానికి పంపించారు. ఇదిలావుంటే శశి నగరంలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఈమె పరిస్థితిని చూసి ఆ హోటల్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి ఆమెకు సాయం చేస్తుండేవాడు. ఇది తెలుసుకున్న రమేష్ భార్యను అనుమానిస్తూ చిత్రహింసలు పెట్టేవాడు. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీ ఉదయం రమేష్ బియ్యం తెచ్చేందుకు హడ్కో కాలనీలో నివాసం ఉంటున్న తన తల్లి విజయమ్మ వద్దకు వెళ్లాడు. పూటుగా మద్యం తాగి మరికొంత ఇంటికి తెచ్చుకున్నాడు. ఆ సమయంలో కూడా భార్యతో పెద్ద గొడవ జరిగింది. ఆ తర్వాత మళ్లీ పంది గంటల సమయంలో భార్యతో గొడవకు దిగాడు. దీంతో శశి తన ఒంటిపై ఉన్న చున్నీ రమేష్ మెడకు వేసి గట్టిగా లాగడంతో అతడు ఊపిరాడక చనిపోయాడు.

హత్యను కప్పిపుచ్చే యత్నం..

రమేష్ మరణించడంతో దీనిని కప్పి పుచ్చేందుకు ఇంటి పెరటి తలుపులు తీసి మధ్యాహ్నం 12 గంటల సమయంతో హడ్కో కాలనీలో ఉన్న అత్త మజ్జి విజయమ్మ దగ్గరకు శశి వెళ్లింది. నీ కొడుకు తలుపులు తీయడం లేదని రమ్మని పిలిచింది. ఇదంతా తెలియని విజయమ్మ తన కోడలిని భోజనం చేయమని, తిన్నాక వెళ్దామని చెప్పింది. భర్తను చంపేసానన్న అనుమానం రాకుండా ఉండేందుకు అత్తతో పాటు భోజనం చేసి ఇంటికి వెళ్లారు. ఎంత సేపటికి తలుపులు కొట్టిన తీయకపోవడంతో పెరటి నుంచి వెళ్లి చూడగా తలుపులు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి చూసి హాల్‌లో రమేష్ విగత జీవిగా పడి ఉండడాన్ని గమనించారు. ఏం జరిగిందని కోడలిని అడుగగా తనకు తెలియదని ఆత్మహత్య చేసుకున్నాడేమో అని చెప్పడంతో.. విజయమ్మ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో కోడలు శశిపై అనుమానం వ్యక్తం చేయడంతో సీఐ పి.ఈశ్వరరావు ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో తానే చంపేసినట్టు శశి ఒప్పుకుంది. నిత్యం వేధించడంతోపాటు తమ మధ్య ఆ రోజు పెద్ద గొడవ జరగడంతో తనను చంపేస్తాడేమోనన్న భయంతో చున్నీ అతడి మెడలో వేసి గట్టిగా లాగడంతో చనిపోయాడని చెప్పింది. హత్య కేసుగా నమోదు చేసి శశి కోర్టుకి తరలించారు. ఈ కేసును ఛేదించిన టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు, హెచ్‌సీ శివాజి, పీసీ రమేష్‌లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఆలయ దర్శనం తరువాత తిరిగి వెళుతూ..

- కారును తప్పించ బోయి ఆటో బోల్తా
- 14 మందికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం


ఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

పోలాకి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోలాకి పంచాయతీ గంటపేట గ్రామంలోని ఓ కల్యాణ మండపం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడి 14 మందికి గాయాలయ్యాయి.. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సంతబొమ్మాళి మండలం కారిపేటకు చెందిన ఆటోలో 14 మంది పోలాకి మండలం గొల్లలవలస శివాలయానికి దర్శనం నిమిత్తం వచ్చారు. స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో గంటపేట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించపోయి ఆటో బోల్తా పడింది. దీంతో వారంతా గాయాలబారినపడ్డారు. గాయాలైన వారిలో ఐదుగురు పిల్లలున్నారు. క్షతగాత్రుల్లో ఇద్దరు మహిళలకు తల, కాలిపై బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి క్షతగాత్రులను 108లో నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా కారిపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారిమని, తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యామని పేర్కొన్నారు. అయితే పెద్ద ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

- మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి


కాలిపోతున్న బైక్

కవిటి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కవిటి మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఒడిశా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కవిటి మండలం తొత్తిడిపుట్టుగ గ్రామానికి చెందిన పొడియా లక్ష్మణ్(22), నరేంద్ర, బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన తుపాకి రాజు(22) ద్విచక్ర వాహనంపై ఒడిశాలోని చీకటిపేట సమీపంలోని జరిగిన ఓ శుభ కార్యానికి మంగళవారం వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో రాత్రి చీకటిపేట గ్రామానికి దగ్గరలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో పొడియా లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం బరంపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజు మృతి చెందాడు. నరేంద్రకు బరంపురం ఆసుపత్రిలో చికిత్స అందించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనంలో మంటలు చెలరేగి అగ్నికి ఆహుతైంది. ఇది లావుంటే పొడియా లక్ష్మణ్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది. వీరిద్దరి మృతితో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.


జలుమూరు: శ్రీముఖలింగంలో క్యూలైన్లలో ఉన్న భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుంటున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి


నరసన్నపేట: సంతపేటలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


కవిటిలో..

శ్రీ మంజునాథం

శివం శివం

- కిటకిటలాడిన శివాలయాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివాలయాలు కిటకిటలాడాయి. శంభో శంకర, హరహర మహాదేవ నామస్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పలు సంస్థలు, వ్యక్తులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. రోజంతా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.

-ఆంధ్రజ్యోతి బృందం


ఆమదాలవలస: సంగమేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు


శ్రీకాకుళం రూరల్: కిష్టప్పపేటలో ఎమ్మెల్యే శంకర్


గార: వీర వసంత ఈశ్వర స్వామి ఆలయంలో..


శ్రీకాకుళం కల్చరల్: తుల్జా భవానీ ఆలయంలో..


రణస్థలం: కంబాలపేట ఎండల మల్లన్న ఆలయంలో


శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి మణి నాగేశ్వర స్వామిని తాకుతున్న సూర్యకిరణాలు


హిరమండలం: దుర్బలాపురం శివాలయంలో సామూహిక రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు


పొందూరు: రాపాకలో శివాలయంలో..


ఎచ్చెర్ల: ఎస్ఎం పురంలోని శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు


కొత్తూరు: శివాలయంలో శివ పార్వతుల కల్యాణం చేస్తున్న భక్తులు


నందిగాం: ఉమా అగస్తేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


పాతపట్నం: జోగి కొండపైకి వెలుతున్న భక్తులు


సంతబొమ్మాళి: మూలపేట శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో నీలకంఠేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి


పోలాకి: మల్లేశ్వరాలయం వద్ద భక్తులు


జి.సిగడాం: మెట్టవలస ఏకశిలా పర్వతంపై..


ఇచ్ఛాపురం: రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక రుద్రాభిషేకాలు

కళలతోనే సామాజిక చైతన్యం


మాట్లాడుతున్న రంగస్థల కళాకారుడు కుమార్‌నాయక్

కాశీబుగ్గ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కళలతోనే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని, వాటిని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య నవ వసంతాల వేడుక కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్త డాక్టర్ రామి నాయుడు, టీవీ, రంగస్థల నటుడు కుమార్‌నాయక్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత కళాకారులకు కళల్లో జాగృతం చేసేందుకు జన జాగృతి సంస్థ కృషి చేయడం అభినందనీయమన్నారు. కళాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. కళలు సమాజానికి సందేశం ఇచ్చేలా ఉండాలని, వాటితో సమాజ ఉన్నతికి పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు రేజేటి బోసు బాబును సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బండారు కాళిదాస్, గౌరవాధ్యక్షుడు ఎల్.వెంకటాచలం, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనున్నది. నగరంలోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. మిగిలిన జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ముగ్గురి మధ్య ప్రధాన పోటీ

బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సుంకరి శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకుంటు న్నట్టు వారం క్రితం ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించాయి. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అదే విధంగా కూటమి భాగస్వామి అయిన బీజేపీకి చెందిన కొందరు నాయకులు సంఘీభావం ప్రకటించారు. కోరెడ్ల విజయగౌరికి వామపక్షాలకు అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సాంకేతికంగా బ్యాలెట్‌లో 10 మంది పేర్లు ఉండగా...వారిలో ఒకరు తప్పుకున్నారు. మిగిలిన తొమ్మిది మందిలో ప్రధానంగా పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే పోటీ ఉంది.

ఉజ్జయిని మహాకాళేశ్వరుని సేవలో...


ఉజ్జయిని మహాకాళేశ్వరుని ఆలయం వద్ద కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి/కోటబొమ్మాళి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఈ పవిత్ర దినాన స్వామిని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని ఆయన అన్నారు. ఆ మహా శివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. అలాగే హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురంలో పంచధామ క్షేత్రాన్ని రామ్మోహన్ నాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను నాగసాధువులు ఆశీర్వదించారు.

చక్రతీర్థ స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి: ఎస్పీ


నదిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

జలుమూరు, ఫిబ్రవరి 26: మహాశివరాత్రి ఉత్సవాల చివరి రోజున శుక్రవారం వంశధార నదిలోశ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల సందర్భంగా భక్తులు స్వామిని తాకకుండా ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. వంశధార నదికి నీరు విడిచిపెట్టినపుడు నీటిప్రవాహం పెరిగి బారికేడ్లకు పాతిన రాడ్‌లు పడిపోకుండా సపోర్టు పెట్టించాలన్నారు. చక్రతీర్థ స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశాలున్నందున వారికి తగ్గట్టుగా ఏర్పాట్లు పక్కాగా ఉండాలనిన్నారు. ఆయనతో పాటు టెక్కలి డీఎస్పీ మూర్తి, నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

గజవాహనంపై గ్రామోత్సవం

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై వేంచేపు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీముఖలింగేశ్వరుని లింగోద్భవం అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పూలు, నూతన వస్త్రాలతో అలంకరించి గజవాహనంపై ఆసీనులను చేసి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, సర్పంచ్ టి.సతీష్, ఎంపీటీసీ హరిప్రసాద్, అర్చకులు వెంకటాచలం, నారాయణమూర్తి, సింహాచలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కంచె ఏర్పాటు


పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంచె

పలాసరూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పలాస మండల కాంప్లెక్స్ ఆవరణలో తొమ్మిది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కంచె నిర్మాణం చేపట్టినట్లు ఎంపీడీవో వసంత్ కుమార్ తెలిపారు. రాత్రి సమయాల్లో ఈ ఆవరణలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులను ఈవోపీఆర్డీ మెట్ట వైకుంఠరావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

పీసీఎంఏ ఎన్నికలకు నామినేషన్లు

పలాస, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పలాస జీడి ఉత్పత్తిదారుల సంఘం (పీసీఎంఏ) ఎన్నికలకు బుధవారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాసరావు, కార్యదర్శులుగా టంకాల రవి శంకర్‌గుప్తా, చుండూరు మహేశ్వరరావు, కోశాధికారిగా సింధిరి సతీష్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల కమిటీ నిర్వాహకులు మల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, తర్లాన రమేష్ కుమార్ నామినేషన్లు స్వీకరించారు. మార్చి 4న ఎన్నికలు నిర్వహించనున్నారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను కలిసిన రఘువర్మ

పాతపట్నం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ బుధవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును పాతపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. పాతపట్నం నియోజకవర్గ పరిధిలో అత్యధిక మెజార్టీ అందిస్తానని భరోసా ఇచ్చారు.

కొండవూరులో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన బంగారం, వెండి వస్తువులు, నగదు
- లబోదిబోమంటున్న బాధితులు


కాలిన దుస్తులు, వంటసామగ్రి, నగదును చూపుతున్న బాధితులు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కొండవూరు గ్రామంలోని పల్లివీధికి చెందిన అడ్డి రమణ ఇంట్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్త్రా, వంటపాత్రలతో పాటు ఏడు తులాల బంగారం, మూడు తులాల వెండి, నగదు కాలి బూడిదైంది. వివరాలిలా ఉన్నాయి.. మహా శివరాత్రి సందర్భంగా కుటుంబ సభ్యులంతా వేకువజామున స్నానాలు చేసి ఇంట్లో దీపం వెలిగించిన అనంతరం శివాలయానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి లోపల నుంచి పొగలు రావడంతో అనుమానంతో తలుపులు తీయగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు స్పందించి మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే సర్వం కాలిపోయాయి. అప్పు తీర్చేందుకు ఉంచిన రూ.1.50 నగదుతో పాటు బంగారు, వెండి వస్తువులు కాలి బూడిదయ్యాయని బాధితులు అడ్డి రమణ, విమల లబోదిబోమంటున్నారు. రమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల తెలుగు యువత నాయకుడు కోనారి కిరణ్ గ్రామస్థులు కోరుతున్నారు.